క్లుప్తంగా

ఓటర్ల జాబితా తయారీకి సహకరించండి



రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

కురుపాం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా తయారీలో అన్ని రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలని, కొత్త ఓటర్ల నమోదుతో పాటు మార్పులు చేర్పులను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అందిరి సహాయ సహకారాలతో ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో తహసీల్దార్ ఆర్.రమేష్‌కుమార్, రాధాకృష్ణ, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపరచాలి



మాట్లాడుతున్న ఎంఈఓలు

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగుపర్చాలని ఎంఈఓలు చంద్రశేఖర్, జనార్దననాయుడు అన్నారు. మండలంలోని టిక్కబాయిలో స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు అర్థమయ్యేలా, ఆకట్టుకునేలా బోధించాలన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలని, జగనన్న విద్యాకానుక కిట్లు ఎవరికైనా అందకుంటే వెంటనే అందించాలని, మధ్యాహ్న భోజన పథకంలో ఇచ్చిన మెనూను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అనంతరం రిసోర్స్ పర్సన్లు పి.దేవానంద్, సింహాచలం ఉపాధ్యాయులకు శిక్షణ అందించారు.

విద్యార్థుల నిరసన



నిరసన తెలియజేస్తున్న విద్యార్థులు

కురుపాం: సమస్యల పరిష్కారం కోరుతూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం కురుపాంలో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కె.రాజు మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలల్లో తగినంత మంది అధ్యాపకులు లేక, పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు ఆరిక రంగారావు, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి మండంగి శ్రీనివాసరావు, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నోటీసులు ఉపసంహరించుకోవాలి



ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు

గరుగుబిల్లి: స్థానిక పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆశావర్కర్లకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గరుగుబిల్లి పీహెచ్‌సీ వద్ద ఆశావర్కర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈనెల 18న రాష్ట్రవ్యాప్తంగా ఆశావర్కర్లు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆందోళనలో పాల్గొన్నారు. ఈ విషయాన్ని జిల్లా వైద్యఆరోగ్య కేంద్ర అధికారులకు, స్థానిక పీహెచ్‌సీ సిబ్బందికి ముందుగానే తెలియజేసినప్పటికీ విధులకు గైర్హాజరైనట్టు ఆశావర్కర్లకు అధికారులు నోటీసులు జారీచేయడం అన్యాయమన్నారు. నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు బీవీ రమణ, ఇందిర, మన్మథరావు తదితరులున్నారు.

విద్యుదాఘాత ఘటనపై విచారణ

వీరఘట్టం: మండలంలోని కొట్టుగుమ్మడ గ్రామానికి చెందిన జూనియర్ లైన్‌మెన్ గురాన శ్రీనివాసరావు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. బాధితుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదుపై పాలకొండ సీఐ మురళీధర్ మంగళవారం గడగమ్మ గ్రామంలో ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. ఈ ప్రాంతానికి జేఎల్ఎం శ్రీనివాసరావు ఎందుకు రావాల్సి వచ్చింది, ఆయనతో ఎవరెవరు ఉన్నారు, పొలంలో ఉన్న విద్యుత్ వైర్లకు సరఫరా ఉన్న విషయం తెలియలేదా తదితర విషయాలను ట్రాన్స్‌కో సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఘటనకు సంబంధించి ప్రత్యక్ష సాక్షుల నుంచి కూడా వివరాలు సేకరించారు. ఆయనతో పాటు ఎస్ఐ ఎం.వెంకటరమణ ఉన్నారు.

అవినీతికి తావులేని జగనన్న పాలన

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి రాజన్నదొర

మక్కువ: అవినీతికి తావులేకుండా అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మక్కువలో ఎంపీడీవో సిహెచ్.సూర్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ప్రజలకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఇంటి వద్దకే గ్రామ వలంటీర్లు వచ్చి, ప్రజలకు ఏమి అవసరమో గుర్తించి, సచివాలయాల ద్వారా అందిస్తున్నారన్నారు. అవినీతి రహిత పాలన చూసి తట్టుకోలేని తెలుగు తమ్ముళ్లు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. మక్కువ సచివాలయం పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మంగళవారం 1393 మంది లబ్ధిదారులు ధ్రువపత్రాలు పొందారన్నారు. ఇటువంటి బృహత్తరమైన పథకాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్నారన్నారు. ఇచ్చిన మాటను నెరవేర్చిన నాయకులెవరో, నేరవేర్చని నాయకులెవరో ప్రజలు గుర్తించుకోవాలన్నారు. మక్కువ మండలంలోని 13వేల మంది లబ్ధిదారులకు నాలుగేళ్లలో వివిధ పథకాల ద్వారా సుమారు రూ.20కోట్ల లబ్ధి కలిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మావుడి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మావుడి రంగునాయుడు, సాలూరు వైఎస్సార్‌సీపీ నాయుకులు దండి శ్రీను, ఐసీడీఎస్ పీడీ విజయగౌరి, తహసీల్దార్ ఎ.సూర్యనారాయణ, ఐసీడీఎస్ సీడీపీవో అనంతలక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఆరేళ్ల నుంచి తిరిగితే...

మక్కువకు చెందిన బోగి చక్రధరరావు అనే లబిదారు మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో నా భార్య సంతోషి నిరుద్యోగ భృతి కోసం దరఖాస్తు చేస్తే తమకు లేని కారు ఉన్నట్టు గుర్తించి రేషన్ కార్డు తొలగించారన్నారు. అప్పటి నుంచి ఆరేళ్ల పాటు అధికారులు, ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో దరఖాస్తు చేస్తే మంజూరైందని సంతోషం వ్యక్తం చేశారు.



బలిజిపేట: పదమాయవలసలో ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేసిన ఎంపీడీఓ విజయలక్ష్మి



సీతానగరం: జగనన్న సురక్ష గ్రామసభలో సర్టిఫికెట్స్ పంపిణీ చేస్తున్న సీతానగరం ఎంపీపీ బి.రమణమ్మ



సీతానగరం: నిడగల్లులో సరిటిఫికెట్స్ పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ.వైస్ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు

సంక్షేమ ప్రదాత జగనన్నను దీవించాలి

- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు

సీతానగరం: ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మనసారా దీవించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు మండలంలోని పెదంకలాం సచివాలయం పరిధిలో గల కృష్ణారాయపురంలో 257వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే అలజంగి జోగారావుకు ఎంపీపీ బి.రమణమ్మ, సర్పంచ్ జి అన్నంనాయుడు, సచివాలయ కమిటీ కన్వీనర్ రెడ్డి అప్పలనాయుడు, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు పి.బలరాంనాయుడు, ఈ.వెంకటరమణ కార్యకర్తలతో ఘనస్వాగతం పలికారు. అంతకుముందు గ్రామంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే అలజంగి జోగారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం గ్రామంలో ప్రతి గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని వారియోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్ల పాలనలో అందించిన సంక్షేమపథకాల అమలు తీరును తెలుసుకున్నారు. గ్రామ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఈ నెలాఖరులోగా పక్కా రోడ్డు వేయడానికి భూమి పూజ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సచివాలయం కన్వీనర్ బి.శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ ఆర్ లక్ష్మణమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు, అధికారులు ఎంఈఓ జి.సూరిదేముడు, ఎస్సై కె.నీలకంఠం, ఏపీఓ భాను, ఏపీఎం శ్రీరాములు, పలుగ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎం.ధనుంజయ్, శ్రీనివాసరావు, ముకుందరావు గోపాలనాయుడు, గౌరునాయుడు, జి దాసు, కిరణ్‌కుమార్, శంకరరావు, ఉమామహేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే

ట్యాబ్‌లపై అవగాహన కల్పించాలి



సదస్సులో పాల్గొన్న ఎంఈఓ జి. సూరిదేముడు

సీతానగరం: విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడే విధంగా రాష్ట్రప్రభుత్వం మంజూరుచేసిన ట్యాబ్‌లపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించుకుని విద్యార్థులకు బోధించాలని ఎంఈఓ జి. సూరిదేముడు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సీతానగరం, ఆర్.వెంకంపేట ఉన్నత పాఠశాలల స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులతో ట్యాబ్‌ల వినియోగంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాబోధనలో మారుతున్న కాలానుగుణంగా నాణ్యమైన విద్యనందించడానికి డిజిటల్ విద్యా బోధన విద్యార్థులకు అందించాలని స్పష్టం చేశారు. ఈ మేరకు ట్యాబ్ వినియోగంపై ఉపాధ్యాయులు అవగాహన కల్పించుకుని విద్యార్థులకు సదస్సులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, సీఆర్పీలు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రులు, జెడ్పీ చైర్మన్‌కు ఎమ్మెల్యే ఘనస్వాగతం



మంత్రులకు స్వాగతం పలికిన ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన పలు సమీక్ష సమావేశాలకు ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి గుడివాడ అమర్నాథ్, రాష్ట్ర డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావులను స్థానిక శాసనసభ్యుడు అలజంగి జోగారావు నియోజకవర్గ ప్రజా ప్రతినిధులు నాయకులతో కలిసి మంగళవారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన సాలూరు నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశంలో వారంతా పాల్గొన్నారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులను జిల్లా ఇన్‌చార్జ్ మంత్రికి ఎమ్మెల్యే పరిచయం చేస్తూ నియోజకవర్గంలో గల పలు కీలక సమస్యలను తీసుకువెళ్లారు. వాటి పరిష్కారానికి ఇన్‌చార్జ్ మంత్రి హామీ ఇవ్వడమే కాకుండా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి, జెడ్పీటీసీ మామిడి బాబ్జీ, అలజంగి రవికుమార్, మూడు మండలాలు, పట్టణ పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, బొమ్మి రమేష్, పాలవలస మురళీకృష్ణ, కొండపల్లి బాలకృష్ణ, ఎంపీపీలు మజ్జి శోభారాణి, గుడివాడ నాగమణి, బలగ రమణమ్మ, వైస్ ఎంపీపీలు వెలిది సాయిరాం, సిద్ధా జగన్నాథరావు, బంకురు రవికుమార్, స్టేట్ డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యా నైపుణ్యం పెంచేందుకు కృషి



ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్న పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ చిన్నికృష్ణ

బలిజిపేట: విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేందుకు అందరం కృషి చేయాలని వంతరాం పాఠశాల కాంప్లెక్స్ చైర్మన్ చిన్నికృష్ణ పిలుపునిచ్చారు. వంతరాం, నారన్నాయుడువలస పాఠశాలల కాంప్లెక్స్ పరిధిలో ఉండే ఉపాధ్యాయులకు వంతరాం ఉన్నత పాఠశాలలో మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు రాయడం, చదవడం నేర్పించడం వల్ల వారిలో చదువుపై ఉత్సాహం పెరుగుతుందన్నారు. అందరం నైతిక విలువలతో పనిచేస్తే ఉపాధ్యాయుడిగా మంచి గుర్తింపు వస్తుందని అభిప్రాయపడ్డారు. ఒక విద్యార్థిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దితే ఎంతో సంతృప్తి కలుగుతుందన్నారు. డిజిటల్ పాఠాల ప్రాధాన్యంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. బోధనలో ఉండే వివిధ సమస్యలపై ఉపాధ్యాయులు చర్చించుకున్నారు.

డీలర్ కుటుంబానికి పరామర్శ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు

సీతానగరం: ఇటీవల సీతానగరం రేషన్ డీలర్ సవరపు రాజు మరణించిన విషయం తెలుసుకున్న పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి కుటుబసభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం మాట్లాడుతూ పార్టీకి మంచి కార్యకర్తను కోల్పోయామని, ఆయనలేని లోటు తీర్చలేమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యురాలు ఎస్.జయమణి, విశ్రాంత ఉపాధ్యాయుడు ఎస్.రామారావు, సీహెచ్ మాధవ్ ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ ధనుంజయ్ పాల్గొన్నారు.

సంపంగిపాడు, నార్లవలసలో 'జగనన్న సురక్ష'



ధ్రువపత్రాలను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సాలూరు: మండలంలోని సంపంగిపాడు, నార్లవలస సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. నార్లవలస సచివాలయానికి సంబంధించి నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్,, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు రామ్మూరి, అనూష తదితరులు ప్రజలకు ధ్రువపత్రాలు ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మెరుగుపడిన ఆర్థిక పరిస్థితులు

పాచిపెంట: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నాలుగేళ్ల పాలనలో పేద, మధ్య తరగతి ప్రజల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడ్డాయని కోటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోటికిపెంట గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పేద ప్రజలు పడుతున్న కష్టాలు నేరుగా తెలుసుకుని వాటిని సకాలంలో పరిష్కరించడానికే జగనన్న సురక్ష అనే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారన్నారు. సురక్ష కార్యక్రమంలో దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారం అవుతున్నాయన్నారు. అనంతరం లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీటీసీలు మాదల సత్యవతి, దండి ఏడుకొండలు, అధికారులు పాల్గొన్నారు.



పాచిపెంట: లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

మంచినీటి సరఫరాకు రూ.12కోట్లు



ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

- టిడ్కో చైర్మన్ ప్రసన్నకుమార్

పార్వతీపురం: పార్వతీపురం మున్సిపాల్టీ పరిధిలో నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాలకు మంచినీటి సరఫరా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రూ.12కోట్లు మంజూరు చేశారని టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం తోటపల్లి ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వద్ద తాగునీటి సరఫరాకు సంబంధించి జరుగుతున్న సర్వే పనులను పార్వతీపురం మున్సిపల్ సిబ్బంది, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్వతీపురం పట్టణం సమీపంలోని అడ్డాపుశీలవద్ద టిడ్కో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో దాదాపు రూ.80 కోట్లతో 768 ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. నిర్మాణంలో ఉన్న జి+3 గృహ సముదాయాలకు, జగనన్న లే అవుట్‌లకు, పార్వతీపురం పురపాలక సంఘం భవిష్యత్ దృష్ట్యా శాశ్వత ప్రాతిపదికన 50 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేసేందుకు ప్రభుత్వం రూ.12కోట్లు నిధులను కేటాయించినట్లు చెప్పారు. ఈ పనుల పరోగతిపై అధికారులతో టిడ్కో చైర్మన్ చర్చించారు. ఈ పరిశీలనలో టిడ్కో ఈఈ జ్యోతి, డీఈఈ బాలకృష్ణ, శిధర్, తదితరులున్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి

బాడంగి: కార్పొరేట్ విద్యాసంస్థల్లో యాజమాన్యాలు చేస్తున్న ఫీజుల దోపిడీని అరికట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద విద్యార్థులతో కలిసి మంగళవారం ధర్నా చేపట్టిన ఆయన కార్పొరేట్ విద్యాసంస్థలు తమ ఇష్టారీతిన ఫీజుల వసూళ్లకు పాల్పడుతున్నారని, విద్యా హక్కు చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే పెండింగ్‌లోని జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన నిధులు విడుదల చేయాలన్నారు.

కోట నుంచి పేటకు....



తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట నుంచి మక్కువ మండలం కొండబుచ్చమ్మపేట గ్రామ సమీపానికి బాతులు మంగళవారం తీసుకొచ్చారు. ఏటా ఇలా బాతులను తీసుకొచ్చి కొన్నాళ్లు పాటు ఇక్కడ ఉండడం బాతుల పెంపకందారులకు అలవాటుగా ఉంది. ఈ బాతులను చూసిన స్థానికులు ముచ్చట పడుతున్నారు.

– మక్కువ

చెట్లకొమ్మల తొలగింపు

గరుగుబిల్లి: పార్వతీపురం నుంచి గరుగుబిల్లి మండల కేంద్రానికి విద్యుత్ సరఫరా చేసే 33 కేవీ లైన్ వైర్లను తాకుతున్న చెట్లకొమ్మలను విద్యుత్‌శాఖ సిబ్బంది మంగళవారం తొలగించారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.